క్లుప్తంగా

అనాథల అస్థికలు కాశీలో నిమజ్జనం



తెనాలి: గత ఐదేళ్లుగా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్థానిక శ్రీ శివలింగేశ్వర భక్తబృంద సేవా సమితి, వారికి పుణ్యలోక ప్రాప్తి కలగాలనే సదాశయంతో ఆస్తికల నిమజ్జనం, పిండ ప్రదానాలను చేపడుతోంది. ఈ క్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను బుధవారం కాశీ పుణ్యక్షేత్రానికి వెళ్లారు. అక్కడి మణికర్ణిక ఘాట్లో అనాథ మృతుల అస్థికలను గంగానదిలో నిమజ్జనం చేశారు. అక్కడే పండితుడితో పూజలు చేయించి, పిండప్రదానం చేశారు. కొందరికి భోజన సదుపాయం కల్పించినట్టు తెలియజేశారు. కరోనా విపత్కర పరిస్థితుల నుంచి అనాథలకు ఉచితంగా అంతిమ సంస్కారాలను నిర్వహిస్తూ పేదలకు అన్నదానం చేస్తున్న కుర్రా శ్రీనును సేవాసమితి కార్యవర్గ సభ్యుడు షేక్ మౌలాలి తదితరులు ప్రశంసించారు.

పది తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



కొల్లిపర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 60మంది పదో తరగతి విద్యార్థులకు గురువారం చివలూరు గ్రామానికి చెందిన యండ్రపాటి నిఖిల్ జ్ఞాపకార్థం అతని స్నేహితులు అందజేసిన పరీక్ష సామగ్రిని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్ కుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యండ్రపాటి నిఖిల్ మెమోరియల్ ఫ్రెండ్స్ టీమ్ మెంబర్స్, ప్రధానోపాధ్యాయుడు ఈదా సాంబిరెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజకుమారి, సత్యసుహాసిని, భూపతి నాయుడు, కె.ప్రశాంత్, ఎన్.డి.వి.ఫణి, డి.వెంకటరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంపై నివేదిక త్వరగా ఇవ్వాలి

తెనాలి రూరల్: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంపై అగ్నిమాపక శాఖ అధికారులు త్వరగా నివేదిక ఇవ్వాలని రైతు సంఘ నాయకులు కోరారు. ప్రమాదం జరిగి 49 రోజులు గడచినా ఇప్పటికీ రైతులకు నష్టపరిహారం అందలేదని, నివేదిక ఇచ్చి బాధ్యులపై చర్యలు తీసుకునేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పసుపు రైతుల కమిటీ కన్వీనర్ పల్లి వెంకట్రామయ్య, సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి, పోరాట కమిటీ నాయకుడు నాదెళ్ల చంద్రశేఖర్ గురువారం తెనాలి అగ్ని మాపక కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాల పంపిణీ

- ఓటు అడిగే హక్కు నాకు మినహా మరెవ్వరికీ లేదు
- రాష్ట్ర ముఖ్యమంత్రిని, నన్ను మరోసారి ఆశీర్వదించండి
- రిజిస్ట్రేషను పత్రాల పంపిణీ సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



రిజిస్ట్రేషను పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



బహిరంగసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాల పంపిణీ చేసి, రూ.1800 కోట్ల సంక్షేమం అందించడం ద్వారా తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజల ప్రేమను నిలుపుకున్నానన్న సంతృప్తిగా ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. అందుకే ప్రజల్ని మళ్లీ ఓటు ఇవ్వమని అడిగే హక్కు తనకే ఉందని, తెనాలిలో మరెవ్వరికీ లేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యేగా తనను గుండెల్లో పెట్టుకుని ఆశీర్వదించాలని కోరారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషను పత్రాల్ని గురువారం పట్టణంలోని 21–40 వార్డులకు చెందిన తొమ్మిది వేల మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మార్కెట్ యార్డులో ప్రత్యేక వేదికపై వేలాదిగా హాజరైన మహిళా లబ్ధిదారుల నుద్దేశించి ఎమ్మెల్యే శివకుమార్ ప్రసంగించారు. నియోజకవర్గంలో గత 75 ఏళ్లలో ఎమ్మెల్యేలంతా 13 వేల మందికి మాత్రమే ఇళ్ల స్థలాల పట్టాల్ని ఇవ్వగలిగారని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ ఒకటికి రెండుసార్లు సభలు నిర్వహించి మరీ తాను ప్రజల్నుంచి అర్జీల్ని స్వీకరించినట్టు గుర్తు చేశారు. ఎవరెన్ని అనుకున్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 580 ఎకరాల భూముల్ని కొనుగోలు చేసి 27 వేలమందికి ఇళ్ల స్థలాల్ని ఇచ్చామని తెలిపారు. తెనాలి నలు మూలలా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంలో ఉన్నట్టు చెప్పారు. పేదలకు కిచ్చిన ఇంటి స్థలం విలువ అయిదు లక్షలకు పైగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇప్పుడు రిజిస్ట్రేషను చేసి సర్వహక్కులతో కూడిన శాశ్వత పట్టాలను అందజేస్తున్నామని వివరించారు. రూ.1800 కోట్ల సంక్షేమాన్ని ప్రజల ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్టు గుర్తుచేశారు. చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం సహా పథకాలతో అందించిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగికి ప్రతినెలా ఒకటో తేదీకి జీతం వచ్చినా, రాకున్నా అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఒకటో తేదీనే ఠంచనుగా పింఛను ఇస్తున్నది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని గుర్తుచేశారు. లేనివాడికి ఆర్థికంగా చేయూతనిచ్చి కొనుగోలు శక్తిని పెంచటం అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. గడప గడపకు మన ప్రభుత్వం 20 నెలలు పర్యటించి ప్రతి ఇంటి తలుపు తట్టినట్టు చెప్పారు. లోకల్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజల కష్టాల్లో సుఖాల్లో భాగం పంచుకున్నదీ తానేనని ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. నియోజకవర్గ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ తెనాలిలో రికార్డుస్థాయిలో ఇళ్ల స్థలాలను పంపిణీచేసి, అందరికీ రిజిస్ట్రేషను పత్రాలను అందజేస్తుండటం గొప్ప విషయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆయా వార్డుల కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, తాడిబోయిన రామయ్య, తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్య, జి.మానసారెడ్డి, షేక్ నూర్ ఇస్మాయిల్, మట్లపూడి సంధ్యారాణి, యాతాటి అనిల్, కొమరాబత్తుని జయపాల్, మొగల్ అహ్మద్‌బేగ్, పేరం సంజీవరెడ్డి, వీర్లపాటి విజయలక్ష్మి, మల్లెబోయిన రాము, శ్రీను నాయక్, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, పార్టీ నేతలు రమేష్, బండ్లమూడి భాస్కరరావు, రావి శ్రీనివాసరావు, రావి ప్రశాంతి, ఎస్.రఘురామిరెడ్డి, పెసర్లంక రమణ, ఏలూరి శేషగిరిరావు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో గోశాల ప్రారంభం

తెనాలి: పట్టణంలో ప్రసిద్ధి చెందిన వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం వివిధ కార్యక్రమాల్ని చేపడుతున్నట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. దేవాలయం పవిత్రతను కాపాడుతూ, అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. దేవస్థాన ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను గురువారం ఆయన ప్రారంభించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులతో కలిసి గోశాలలో పూజలు చేశారు. గోమాతకు హారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు దేవరకొండ వెంకటరమణశంకరరావు, కురగంటి సునీత రవిశంకర్, బట్టు దుర్గారావు, ముంతా ప్రసాద్, మావులూరి శ్రీనివాస్, బొద్దులూరి సరస్వతి, నాగేశ్వరరావు, కనికిచర్ల సందీప్, వంగల జగదీశ్వరి, అళహరి రవికుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు ప్రారంభం

తెనాలి: స్థానిక 32వ వార్డులోని అమరావతి ప్లాట్స్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన అన్నాబత్తుని సత్యనారాయణ అమృత్ మున్సిపల్ పార్కును గురువారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. మొత్తం రూ.79.95 లక్షలతో ఈ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాల్ని అమర్చారు. పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా వర్కవుట్స్‌కు తగిన పరికరాలను ఏర్పాటుచేశారు. పార్కును పరిశీలించిన ఎమ్మెల్యే శివకుమార్, అక్కడి సౌకర్యాలను వినియోగించుకోవాలని స్థానికులకు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలరు మట్లపూడి సంధ్యారాణి పాల్గొన్నారు.

జగ్గడిగుంటపాలెంలో వైఎస్ విగ్రహావిష్కరణ

రూరల్ మండల పరిధిలోని జగ్గడిగుంటపాలెంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. అక్కడి ప్రగడ కోటయ్య నగర్‌లోని చేనేత కార్మికుల ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. వైఎస్సార్ హయాంలో చేనేతలకు జరిగిన మేలుకు కృతజ్ఞతగా వారే చందాలు వేసుకుని మరీ ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్. విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఇన్‌చార్జి కొడాలి క్రాంతి, గ్రామ ఉపసర్పంచ్ గోలి లక్ష్మీనారాయణ, అద్దంకి వేణుగోపాల్, కుర్రా జస్వంత్, పసుపులేటి వెంకయ్య పాల్గొన్నారు.

జగనన్న సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తెనాలి అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని 14వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దాసరి వీర వసంతరావు సూచించారు. చినరావూరు తోటలోని సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వీర వసంతరావు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వైద్య శిబిరాల్ని నిర్వహిస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తుందని చెప్పారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ జనరల్ ఓపీ 159, గైనకాలజీ 32, జనరల్ మెడిసిన్ 156, ఆప్తమాలజీ 36 మందికి వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందుల్ని పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ దివి కిశోర్ కుమార్, డాక్టర్ ఎం.అనురాధ, డాక్టర్ టి.వినీల్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి బస్టాండ్ సమీపంలో సాయిబాబా గుడి వద్ద బైక్‌పై వెళుతున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు గురువారం తనిఖీ చేశారు. అతని వద్ద 11 క్వార్టరు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసు లు తెలిపారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు.

వైఎస్సార్ సీపీని గెలిపించండి



22వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప, కౌన్సిలర్ దుబాయ్‌బాబు



మహిళకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్లు



హనుమాన్‌పాలెంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుమారుడు అఖిల్ గణేష్



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కుమారుడు సత్యనారాయణ

తెనాలి అర్బన్: వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం అన్నాబత్తుని పుష్ప 22వ వార్డులో, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక 4వ వార్డులో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, ఓట్లు అభ్యర్థించారు. 22వ వార్డులో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలమూరి విజయలక్ష్మి కుమారి, షేక్ గఫూర్, కోలా వాసు, కఠారి హరీష్, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, ఈద్గా గౌస్, 4వ వార్డులో తెనాలి పట్టణ క్లస్టర్–1 వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, కొమ్మరబత్తిన జయపాల్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

హనుమాన్‌పాలెం(కొల్లిపర): వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శివకుమార్ చిన్న కుమారుడు అన్నాబత్తుని అఖిల్ గణేష్ కోరారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని హనుమాన్‌పాలెం లో ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలసి ప్రతి గడపకు వెళ్లారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమం కరపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ మోసపూరిత హామీలు నమ్మవద్దని సూచించారు. మాట తప్పకుండా హామీలు నేరవేర్చి ప్రతి అడుగులో మంచి చేస్తున్న జగనన్నకు ప్రతి ఓటరు అండగా నిలవాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను ఎమ్మెల్యే గా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

జగ్గడిగుంటపాలెంలో ప్రచారం

తెనాలి టౌన్: రూరల్ మండలం జగ్గడిగుంటపాలెంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కుమారుడు సత్యనారాయణ గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల్ని గెలిపించాలని సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కుంభం బాలాజీ, ఎంపీటీసీ సభ్యురాలు ఖాజా భద్రావతి, పసుపులేటి అంజయ్య, డోగిపర్తి రాజేష్, కొడాలి క్రాంతికుమార్, గోలి లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ



పీవీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి రజిని, విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ కావటి

పట్నంబజారు: బ్రాడీపేట ప్రధాన రహదారిలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతరత్న పీవీ నరసింహారావు విగ్రహాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, మేయర్ కావటి మనోహర్ నాయుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము)తో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులంతా సంఘటితంగా పీవీ విగ్రహాన్ని గుంటూరులో ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమని ప్రశంసించారు.

దేశానికే వన్నె తెచ్చిన మహనీయుడు పీవీ

ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పనిచేసి ఇటు రాష్ట్రానికి, అటు దేశానికే వన్నె తెచ్చిన మహనీయుడు పీవీ నరసింహారావు అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కొనియాడారు. బ్రాహ్మణ జాతి మాత్రమే కాక యావత్ భారత జాతి గర్వించదగ్గ మేధావిగా ఆయన్ను అభివర్ణించారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ పీవీ నిర్ణయాలు, ఆర్థిక సంస్కరణలే భారతావనికి దిక్సూచిగా మారాయని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు గొప్ప పరిపాలనా దక్షుడే కాక బహుభాషా పండితుడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపు శ్రీకాంత్, విగ్రహ దాతలు తుళ్లూరు ప్రకాష్, సురేఖ దంపతులు, పరశురామ బ్రాహ్మణ సంఘం ప్రతినిధి ఆదిలక్ష్మి, బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు బాలకృష్ణ, పొత్తూరి శ్యామ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరామశర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పోకల వెంకటేశ్వరరావు, అన్నదాన సత్రం చైర్మన్ పోకల వసంత్, క్లస్టర్ ట్రెజరర్ మహేంద్ర గులేచా, అన్నంరాజు సాయిరాం, అయితి సతీష్, ఆదిత్య రామకృష్ణ, ఆడిటర్ గణపతి, మన్నేపల్లి హనుమంతరావు, డేవిడ్, నాగార్జున, మాదాసు కిరణ్, సింగు నరసింహారావు, ఆలా కిరణ్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ పూర్ణచంద్రరావు

నెహ్రూనగర్: బహుజనులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని, రాజ్యాధికారంతోనే అభ్యున్నతి సాధ్యమవుతుందని విశ్రాంత డీజీపీ, బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ జె. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పెన్షనర్స్ భవన్ లో గురువారం జరిగిన బీసీ కులాల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అధికంగా ఉండే బహుజనులకు ఆరు నుంచి ఏడు సీట్లు మాత్రమే కేటాయిస్తున్నారన్నారు. ఏడు శాతం ఉన్నవారికి రాజ్యాధికారం అప్పగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అంగడి సరుకులుగా బహుజనులను వాడుకుంటున్నారే తప్పా వారికి న్యాయం జరగడం లేదని తెలిపారు. బహుజనులకు సబ్ ప్లాన్ నిధులు, కార్పొరేషన్లు వద్దని కేవలం రాజ్యాధికారం మాత్రమే కావాలని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు పోటీలో ఉంటే వారికి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు.

ఆత్మస్థైర్యంతో మహిళలు పురోభివృద్ధి సాధించాలి



ఎన్‌జీవో ఉపాధ్యక్షురాలు సుజాతబాయిని సన్మానిస్తున్న సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత



ఇరిగేషన్‌శాఖ కార్యాలయంలో ఉద్యోగినిని సన్మానిస్తున్న ఈఈ మల్లికార్జునరావు, సిబ్బంది



విశ్రాంత పీపీ సుగుణ కుమారిని సన్మానిస్తున్న అధ్యాపకులు



ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో వేడుకలు

తెనాలి రూరల్: మహిళలంతా అకుంఠిత దీక్షా,దక్షత, ఆత్మస్థైర్యంతో ప్రతి రంగంలోనూ అభివృద్ధిని సాధించాలని తెనాలి రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత తెలిపారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెదరావూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి ప్రసంగిస్తూ నేటి సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఇంకా కొన్ని చోట్ల స్త్రీలపై అఘాయిత్యాలు, వివక్ష కొనసాగతుండటం బాధాకరమన్నారు. పురుషులతో పాటు స్త్రీలు అన్ని రంగాలలో సత్తా చాటుతూ ముందుకు వెళుతున్నారని, దురదృష్టవశాత్తు పనిచేసే ప్రదేశాలలో, కళాశాలల్లో, ఇళ్లలో వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీకి జరిగిన అన్యాయానికి, హక్కుల ఉల్లంఘనకు చట్టరీత్యా పోరాటం చేసేందుకు న్యాయస్థానాలకు, పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. అర్హులైన మహిళందరికీ మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చట్టాల గురించి తెలుసుకొని ప్రజలంతా చైతన్యవంతులు కావాలని ఆమె సూచించారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, గ్రామ సర్పంచ్ కె. రమాదేవి, కార్యదర్శి సుబ్బారావు, మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, సరళ, యర్రంశెట్టి అనిల్‌కుమార్, విజయ్, తెనాలి రూరల్ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు

తెనాలి అర్బన్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం నిర్వహించారు. మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఇరిగేషన్‌శాఖ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఈఈ ఎస్.మల్లికార్జునరావు మాట్లాడుతూ సమాజంలో మహిళల ఆవశ్యకత ఎంతో పెరిగిందన్నారు. అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమని చెప్పారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. జిల్లా వైద్యశాలలో వేడుకలు నిర్వహించారు. ఎన్‌జీవో అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు సుజాతబాయితో పాటు పలువురిని సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, వైద్యులు ఘనంగా సన్మానించారు.

మహిళల రక్షణకు పలు చట్టాలు

తెనాలి అర్బన్: మహిళల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకువచ్చిందని, వాటి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యదేవర సుగుణకుమారి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే నేడు మహిళల్లో ఎంతో చైతన్యం వచ్చిందని చెప్పారు. పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తిలో వాటా వస్తుందని తెలిపారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రవీంద్రనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో వేడుకలు

తెనాలి: స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో గురువారం ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఐపీఏ ఎస్.ఎఫ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో కాలేజీ మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నా రు. బ్యాడ్మింటన్, క్యారమ్స్, డాన్స్, పాటల పోటీల్ని నిర్వహించారు. విజేతలకు కాలేజీ ప్రిన్సిపాల్, అసోసియేషన్ ఆఫ్ ఫార్మస్యూటికల్ టీచర్స్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటరమణ బహుమతుల్ని అందజేశారు. అనంతరం కాలేజీలో అధ్యాపకులుగా, ల్యాబ్ అసిస్టెంట్లుగా, అధ్యాపకేతర సి బ్బందిగా పనిచేస్తున్న మహిళల్ని సత్కరించారు. కార్యక్రమాన్ని ఐపీఏఎస్ఎఫ్ విభాగం, మెంటార్స్ అసోసియేట్ ప్రొఫెసర్ ఫణికృష్ణ, పి.భార్గవి పర్యవేక్షించారు.

ఐసీడీఎస్ కార్యాలయంలో వేడుకలు

తెనాలి టౌన్: మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహంతో పాటు భాగస్వామ్యుల్ని చేయడానికి హక్కుల గురించి వారికి అవగాహన కల్పించాలని శారద చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ శారద పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంతో పాటు తెనాలి, కొల్లిపర, రూరల్ మండలాల్లోని ప్రాజెక్టు స్థాయిలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత అంగన్‌వాడీ కార్యకర్త ప్రేమకుమారి, గర్భిణులు, చిన్నారులకు సేవలు అందించిన అత్తోటకు చెందిన ధనలక్ష్మి, హెచ్.లక్ష్మీకుమారిలను అతిథులు సత్కరించారు. సీడీపీవో ఎం.సునీత అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ శారద మాట్లాడుతూ లింగ సమానత్వం గురించి ప్రతి ఏడాది మహిళా దినోత్సవం తెలియజేస్తున్నట్లు చెప్పారు. న్యాయవాది అంజనీకుమారి మహిళలకు ఉన్న చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వీఎస్సార్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.సౌజన్య, కె.వెంకటలక్ష్మి, కె.రాధిక, కె.యానాదమ్మ, నాగమణి, వెంకటరమణ, హిమబిందు పాల్గొన్నారు.

- రూరల్ మండలం కఠెవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం తాటి శ్రీధర్ అధ్యక్షత జరిగిన సభలో ఉపాధ్యాయినులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెప్యూటీ డీఈవో వసూళ్ల వ్యవహారంపై విచారణ

హెచ్‌ఎంలను విచారించిన ఆర్జేడీ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు డీవైఈవో పి. వెంకటేశ్వరరావుపై వచ్చిన అవినీతి, ఆరోపణలపై పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి గురువారం విచారణ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని తన కార్యాలయానికి పిలిపించుకుని గోప్యంగా విచారణ జరిపారు. పాఠశాలల తనిఖీలకు, సందర్శనలకు వెళ్లిన సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వసూళ్లకు పాల్పడటంతో పాటు వివిధ రకాలుగా వేధింపులకు పాల్పడిన సంఘటనలపై హెచ్‌ఎంలు, పాఠశాలల యాజమాన్యాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి హెచ్‌ఎంలు చెప్పిన అంశాల వారీగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్లు చెప్పారు.

ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. విజయపురికాలనీ 5వ లైనులో నాగాంజనేయులు కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున లేచి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. రెండు బెడ్ రూముల్లో బీరువాలు తెరిచి ఉన్నాయి. వాటిల్లోని 200 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు.